# విద్య-వింత పశుత్వం*

కే. కామేశ్వరరావు

## ౧

'ఏమేవ్!'

'ఎందుకూ?'

'ఎప్పుడూ కొత్తే.'

'ఇది నాకు పాతగిలదు.'

'చదువుకోమని నీ కెన్నిసార్లు చెప్పాలి?'

'చదువంటే చిన్నపిల్లలకే యేడుపొస్తుంది. పెద్దవాళ్ళకు మరిరాదూ?'

'నీయేడుపేగాని నాయేడుపు చూడవూ?'

'ఊఁ.'

'నిన్న నీకు పంపించినచీటీ చూసేవూ?'

'చూడకుండానే పంపించేనేమిటి మీరడిగిన వస్తువు?'

'నేనడిగినవస్తువే పంపించేనంటావూ?'

'మరి!'

'దానిమీద వున్నదేమిటి, నువ్వు పంపించిందేమిటి?'

'మీరు చాంతాడుకామా పంపించమన్నారు?'

'నీతెలివితేటల కంతేనా సంతోషించేను! ఇంటిదగ్గిర తాళంచెవి మరిచిపోయేను, పంపించమని నేను రాస్తే చాంతాడా పంపిస్తావు! చాంతా డెందుకూ వురెట్టుకోమనా?'

'మీకు వారం వర్జ్యమూ లేదు. బుధవారం పూటా అలాఅనుకోడ మేమిటి?'

'మరి నేనురాసిందేమిటి, నువ్వుపంపించిందేమిటి? పోనీ గొలుసుకట్టురాతేమోనంటే గవ్వల్లాంటి అక్షరాలు రాసేను, నీతెలివితేటలు తెలిసివుండే'

'ఎవళ్ళకేనా చూపిద్దామంటే ఆచీటీలు చూపించకూడ దంటారు. అందులో యేంపరమరహస్యాలుండిపోతాయనో!'

'నీకు చదువురాకపోగానే రహస్యాలుండక పోతాయేమిటి? లేకుంటే నాకూ పరమసంతోషమే. యేయేడుపు, యేమొర్ర వుండదు. తాళంచెవి మరిచిపోయేనని బండబూతులు తిట్టేకు, ఆవెర్రిముండాకొడుకు వుద్యోగస్తుడు.'

'తప్పొస్తే తిట్టకూ?'

'అనుగదీ మాట! నావల్ల తప్పొస్తే తిట్టేను. నీవల్ల తప్పొస్తే నేను తిట్టకూడదు. అంతేనా నువ్వనేది?'

'బుధవారంపూటా తిడుతూకూచోండి. వారం వర్జ్యం లేదమ్మా యీతిట్లకి.'

'మరయితే అక్షరంముక్కలు కాస్త నేర్చుకో.'

'ఆడవాళ్ళకి చదువు, మొగాళ్ళకి వంట.'

'ఏమిటే?'

'ఏం లేదు.'

'నువ్వేదో పెద్దచదువు నేర్చేసుకుని నా ఆఫీసు పనిలో సహాయపడతా వనుకుంటున్నాను నేను.'

'సిగ్గుసిగ్గు, యింకా వుద్యోగం కూడా చెయ్యమంటారుకామోసు నాఖర్మం కాలిపోను. ఈ పాటి వూరుకుందురూ యెవరేనా వింటే నవ్విపోతారు కూడాను.'

'అయితే ఆఫీసుపనితో చావమన్నావేమిటి?'

'అలాంటిమాటలే ఆడవద్దన్నాను.'

'మరి కాస్తచదువుకో, నేనూ సుఖపడతాను, నువ్వూ సుఖపడతావు.'

---

* ఈరచన ౧౯౩౧ సం. సెప్టెంబరునెలలో రచించబడింది. కే. కా.

'పోనీ నామాట వినండి. చదువొచ్చినవాళ్లంతా యెలా చెడిపోతున్నారో చూసేరా?'

'ఎవళ్లు చెడిపోయేరో చెప్పు.'

'మాఅమ్మ వేలువిడిచిన పెత్తల్లికూతురు అదేదో ఫారమమ్మా- నా కావెనవపేర్లే రావు- తర్డుఫారంక మోసు చదువుకుందిట. మొగుడిమాట అసలే వినదు. గిం జుకునిచచ్చినాసరే, గిజామన్నా సరే.'

'తర్డుఫారంకూడా వొకచదువే. నల్లీ వొక యిల్లాలే, నాగమయ్యా వొక బ్రాహ్మడే అన్నట్టు తర్డు ఫారంకూడా వొకచదువే. ఇంకేం బుగ్గిలో వేలెట్టడమే చదువన్నావుకాదు, నీధర్మమా అంటూ. చదువురాని మనిషి కాబట్టే అలాచేస్తూండి. చదువొచ్చినవాళ్లు బుద్ధిమంతులయే వుంటారు సామాన్యంగా. జ్ఞానంరావడానికి చదువుకోడంగాని దుష్టులవడానికీ, దుర్మార్గులవడానికీ కాదు.'

'మీతో యెవళ్లు వాదించగలరూ.'

'ఈపాటికి పలకతియ్యి. కాస్త బుద్ధిగా చదువుకో. నువ్వూ సుఖపడతావు నేనూ సుఖపడతాను. ఒరే అబ్బాయీ, * కాస్త చదువుచెప్పు బాబూ. (అబ్బాయి వస్తాడు.) నాకు పనుంది. వెళుతున్నాగాని నువ్వు శ్రద్ధగా చదువుకో. తెలిసిందా. వింటున్నావా' (వెళతాడు).

'.................'

'పిన్నీ!'

'ఊc.'

'పలకని పట్టుకో.'

'ఆరాయపలసిందేదో నువ్వేరాయి.'

'నేనురా నేక్కే లే. ఈ వృత్తులపాఠంలో పేర్లు చెప్తాను రాయి. 'మంగలి' 'కమ్మరి.''

'అబ్బ! నేనుపోయి చెంబులు తోముకోవాలి. వేళయిపోయింది. వెధవచదువు, తగలబెట్టినచదువు. నాపాలిటి యమపాతలా వచ్చింది. నాకు చదువూవద్దు, చట్టుబండలూ వద్దు' (వెళిపోతుంది. భర్తవస్తాడు.)

'ఏమిరా పిన్ని చదువుకుంటూందీ?'

'నాకెందు కీవెధవచదువు, పోయి చెంబులు తోముకోవాలని వెళ్లిపోయింది.'

'నువ్వువెళ్లి పిలుచుకురా. (అబ్బాయి వెళతాడు.) శివ! శివ! నాకేం దిక్కుతోచడం లేదు. భర్తృత్వానికి, ఉపాధ్యాయత్వానికి యేమీ పొత్తు కనపడడం లేదు. రాతిగుండె చేసుకుని నే నెక్కడకొస్తేది. ప్రేమ, అనురాగం పెరగవలసినచోట కొట్లూతిట్లూ, కఠినత్వమున్నా. బాబోయ్! ఆమామగారి ముండాకొడుక్కి జ్ఞానం లేకపోడంవల్ల కదా యీపాట్లు పడవలసివచ్చింది. వాడికే జ్ఞానముంటే యిలాగుండేదా? సరే, ఏదో నెమ్మదిగా చెప్పిచూస్తాను, వింటే,వింటుంది లేకపోతే నోరుమూసుకుని కూచుంటా. అంతేకాని పడకగదిని యుద్ధరంగ మెక్కడచేసుకోను? నాపనికాదని......ఇంకా రాలేదేం? రానని మొండికేసికూచుందేమో. నేనే అక్కడికి వెళ్లి కనుక్కుంటా.'

## ౨

'ఏమిటిచేసేవ్ వంట.'

'ముందు విస్తరిపెట్టుగునే అడగడం?'

'విస్తట్లో అన్నంరాసితప్ప మరేం కనబడడం లేదు.'

'మీరు తెచ్చుకున్న బియ్యమేకదూ, దంపుళ్ల బియ్యం. అంబటికూడులాగ యెర్రగా వుంది. ఎవళ్లేనా చక్కగా గోళ్లలోయిమిడేటటువంటి, తెల్లటి బియ్యం తెచ్చుగుంటారా, లేక ముతకబియ్యం తెచ్చుగుంటారా?'

'వీటిలో సత్తువు తగలడ్డదని శాస్త్రజ్ఞులనడం వల్ల కామా యీ బియ్యం తెచ్చేను. వెధవపాట్టు యెంత తిని యేం ప్రయోజనం. సత్తువున్న తిండి తినాలా, పూకనవలాలా?'

'మీయిష్టం. నాకు వాదనలు చేతకావు.'

'.................'

'.................'

* అన్నకొడుకు.

'ముడిపెసలు పచ్చడి చెయ్యమన్నానుకదూ.'

'పోనీ నేనొకమాటడుగుతాగాని చెప్పండి. మాటాడితే కోపంగాని......'

'నాకు కోపమా! నాకంటే శాంతమైనమొగాడెక్కడేనా వుంటాడా.'

'ఎవళ్లమట్టుకు వాళ్లు అలాగ అనుకోకపోతే మరోలాగ అనుకుంటారేమిటి?'

'అలాగా!'

'నే ననేది వినండి. ఎవళ్లేనా ముడిపెసలు పచ్చడి చేసుకుంటారా, లేక పెసరపప్పు పచ్చడి చేసుకుంటారా?'

'ముడిపెసల పచ్చడితింటేనే మంచిదిట. ఆ పొట్టులో విటమిన్లు అనే జీవపదార్థాలున్నాయిట. అది శాస్త్రజ్ఞులన్నమాటే. నా తెలివితేటలు కావవి. మంచి తిండి తినక గడ్డితినడ మెందుకు?'

'అన్నీ వింతలూ విపరీతాలూనమ్మా యీమనిషితోటి.'

'..................'

'..................'

'మళ్లీ సీసపుగిన్నెతోనే చారుపెట్టి యిత్తడి గరిటెతో వడ్డిస్తున్నా?'

'ఆమాయచచ్చినాడు, యిచ్చినతగర మంతా పుచ్చుకుని, వాడికేంపోయికాలం వచ్చిందో వాడిల్లు మాసిపోను, సీసపుగిన్నె మననెత్తిని కొట్టేడు.'

'ఔను, నిజమే. వాడు మోసంచేసేడు. మనం యేడ్చేం. మళ్లా నేను మంచిగిన్నె పట్టుకొచ్చేనుగా.'

'ఆగిన్నె మట్టుకు వాడుకోవద్దన్నారేమిటి. పెంట మీద పారెయ్యమన్నారా?'

'ఏడిసిన తెలివితేటలు. పశువు తెలివితేటలు... ......ఆయిత్తడి గరిటేమిటి చారులో.'

'మాఅమ్మ యెప్పుడూ అలాగే వడ్డిస్తుంది మా నాన్న యేడ్చినాసరే, చచ్చినాసరే.'

'అయితే నన్నూ అలాగే అంటావూ.'

'గురువారంపూటా తీరుబడిగా కూచుని అలాంటి మాట లేమిటీ.'

'అయితే నిన్ను యేపూట అనవచ్చో, యేపూట అనకూడదో చెప్పు?'

'ఆడదాన్ని యెప్పుడూ అనకూడదు. తిట్టడం తిమ్మడం వొకగొప్పా యేమిటి?'

'అవును నోటితో చెప్పడం నాదే బుద్ధితక్కువ, చేతితో చెప్పాలికాని.'

'అదే తక్కువయింది!'

'..................'

'..................'

'ఉసిరికపచ్చడి కాస్త వెయ్యి.'

'ఇవాళ మట్టుగోకూడదు.'

'దానికీవచ్చిందీ పెద్దదయ్యం!'

'........ ..... ...'

'మరయితే బచ్చలికూరేనావండ లేకపోయేవూ?'

'ఇవాళ బచ్చలికూర కోస్తారేమో కాస్త తెలిసిన వాళ్ల నెవళ్లనేనా అడగండి. ఇవన్నీ మీయింట్లో ఆచారాలుగాని మరేయింట్లోను యిలాగుండదు.'

'అనాచారాలకీ దురాచారాలకీ మీచదువులోనూ మీశాస్త్రంలోనూ ఆచారాలని పేరు.'

'నేను వాదించలేనుబాబూ.'

'ఏదో యివాళమట్టుకు భోజనమయింది. ఇంక—'

'విస్తరి మీ రెత్తకండి.'

'నువ్వీయెంగిలివిస్తట్లో తినకూడదు.'

'అదంతా మీకెందుకూ ఆడవాళ్లం మేమేదో యేడుస్తాం.'

'ఎంగిలివిస్తట్లో తినకూడదని చెప్పేనా?'

'అలాగేలెండి.'

'........ .........'

‘ మళ్లీ తీస్తారెందుకూ. మీకు తెలియదుకాని ముగుడివిస్తట్లో తింటే తప్పు లేదుట. ’

‘ ఎంగిలివిస్త రిది. ’

‘ అబ్బ ! తనన్నమాటేగాని మరోటిలేదీ మనిషికి. ఇదిగో ! మాఅమ్మ యేభై యేళ్లొచ్చినా మానాన్న యెంగిలివిస్తట్లోనే కాని మరోదాంట్లో తినదు... ఈ మొగాళ్లకి చెప్పలేమమ్మా. వెధవముండలికి పెళ్లిళ్లు చేసేరకం. ’

## 3

‘ ఆలాంతి రిలా తెచ్చిపెట్టం డొకమాటు. ’

‘ నువ్వు తీసుకెళ్లు నేను చేస్తూన్నపని మానడం లేదూ? ’

‘ లాంతరు నేను ముట్టుగోకూడదు. ’

‘ ఏమీ, దాన్ని దారపుపోగు లున్నా యేమిటి?’

‘ లాంతరు ముట్టుకుంటే మయిలడిపోనండీ. అందులో కిరసనాయిలుంది. ఇంగ్లీషువాడిమాయఅది ’

‘ అదిగదీసంగతి. ఇంకా చెప్పేవుకాదు! నీ తెలివితేటల కింతేనా సంతోషించేను. నీకు తెలిసిన మాయావేదాంతం యే మొగాళ్లకేనా తెలుసా ? ’

‘ అయితే తీసుకురా రేమిటి ? ’

‘ ఇంకా నన్నడగాలా ? ’

‘ చీకట్లోనే వెళతాను. ’

‘ వెళ్దువుగాని......అదేమిటి రాత్రిపూటా స్నాన మెందుకుచేసేవు ? ’

‘ ఒకమాటుకాదు, రెండుమాట్లుకాదు, మూడు మాట్లు చెయ్యవలసివచ్చింది. నాఖర్మాని కెవరేం చేస్తారూ ? చచ్చినముండాకాపది గిన్నెల్ని మసివుంచేసింది. అప్పటికీ జాగర్తగానే చూసేనమ్మా. అయినా అంచులకింద రవంత వుండిపోయింది. దాన్ని ఫుల్లెట్టి గోకిగోకి కడిగిపెట్టి స్నానంచేసి వస్తూవుంటే కంటికి శూద్రాడు కనపడ్డాడు. ఈ మైలపడుకూడా యింట్లో యెక్కడ కలుపుగోడమని మళ్లా స్నానంచేసేను. చేసి వస్తూవుంటే అదేమిటో నాఖర్మంకాలా, ఇంతకీ తలరాత తప్పించడ మెవరిశఖ్యం, కాలికి మెత్తగా తగిలింది. ఇదేమిటి చెప్మా అనిచూస్తే గుడ్డపేలిక. నోరు నొక్కుకుని చచ్చినట్టువెళ్లి మళ్లా స్నానంచేసి కాళ్లు యెత్తెత్తి వేసుగుంటూ వచ్చేను. ఏం చెయ్యమన్నారు ? బ్రాహ్మల కుటుంబం, బ్రాహ్మణజన్మ. ఈకాలంలో బ్రాహ్మల కుటుంబంలో పుట్టడమే పాపమయిపోయింది. ’

‘ నిజమే. ’

‘ మీఅనాచారాలకి,మీ మైలతిళ్లకి శూద్రపుట్టుకే సరిపోతుంది. ’

‘ ఏడిసినగొప్పతనం. నోరుమూసుకో........ మొన్నవుపవాసం, నిన్ననోము, యివాళ మూడుస్నానాలున్నా ? రేపు.—’

‘............... ...’

‘ మంచమెక్కడమున్నా. ’

‘ ఊరికే యెందుకూ ఆశాపనార్థాలు. నిజంగా రాకపోయినా మీరన్నందుకేనా వొచ్చితీరుతుంది. నాకు తెలుసు మీమాట మహిమ. ’

‘ అదీమాట. సరిలే. నేనైమందు తేను. నీఖర్మం యెలాగుంటే అలాగుంటావు. ’

‘ నా కసలు మందుతినడమంటే అసహ్యం; డోకొస్తుంది. మందుతింటే జ్వర మెక్కుపోతుంది. ’

‘ నీఖర్మం. ’

‘.....................’

‘.................’

‘ అలా నడవకండీ. ’

‘ ఏమీ ? ’

‘ ఆదారినే అంట్లగిన్నెలు తీసుకెళ్లేను. పేడనీళ్లుజల్లడం మరిచిపోయేను. ’

‘ అయితే దారిఅంతటా చల్లుతావేమిటి ? ’

'ఇదిగో నే వొక్కమాట చెప్తా వినండి. మా అమ్మ ఆచారం సంగతి మీకసలు తెలియదుకమోసు. నా ఆచారం సంగతలా వుంచండి.'

'ఏదీ చెప్పు. విందాం.'

'భోజనాలయేక మాఅమ్మ పీటలు, యిల్లే కాకుండా గోడలు కూడా కడుగుతుంది. బజారునుంచి తెచ్చిన వస్తువుమీద శుద్ధినీళ్లు జల్లితేగాని తియ్యనే తియ్యనూ. ఇదంతా మీకు వెటకారంగా వుంటుంది కాని నేనుమట్టుకు నిజం చెప్తున్నాను. ఉప్పు కడిగి యెండలో పెడుతుంది.'

'ఆతల్లికి పుట్టినదానివేకమా నువ్వు. నువ్వు నిప్పు కడిగి తెచ్చుకుంటావు.'

'మీమాటలెప్పుడూ వొక్కలాగే వున్నాయి. ఇదంతా యెందుకు చెప్పేనో తెలుసా?'

'ఎందుకూ?' ...............

'కాళ్లమీద నీళ్లు పట్టండి. అక్కడ తొక్కరని నా అనుమానం.'

'నేను వెళ్లేక నీయిష్టంవచ్చిన ట్లేకుడు.'

'నీళ్లు పట్టండీ.... అబ్బ! ఆడవాళ్ల గొడవలు వీళ్లకెందుకో. ఇలాంటి అనాచారపాళ్లకి మళ్లా పుట్టగతులుంటాయా.'

ర

'ఏమండోయి!'

'ఊ.'

'అదేమిటో యెప్పుడూ మొహం ముడుచుకునే వుంటారు.'

...................

'నీముఖవికాసం నాకు రమ్మంటే యెలాగు వస్తుంది. నువ్వంటే సాక్షాత్తు సరస్వతీదేవివి, గొప్ప కుటుంబంలో పుట్టినదానివి, బ్రాహ్మణజన్మ—'

'ఎప్పుడూ మీకు చదువు, పుస్తకాలే. నగలు నాణేలు చేయించిపెడతాననడం లేదు. చదువుకో, చదువుకో, చదువుకో.'

'నోరుముయ్.'

'అసలు నేచెప్పవచ్చేమాట వినండి. ఎంతవిచిత్రమమ్మ!'

'ఏమిటావిచిత్రం?'

'కూరెళ్లవారిచిట్టెమ్మ మరేమోనే కాలిమీద కడియంకింద కురుపేసిందని కాలికడియం తీయించేసుకుంది.'

'అదీ విచిత్రమే! అయితే కురుపేసినా కడియం తీసెయ్యకూడదంటావు.'

'ఇంకా నెమ్మదిగా అంటారు. కాలుకింద కురుపేస్తే కడియంతీసెస్తారా! ఎంతశోద్యం! మాలాటివాళ్లు కాలుపోయినాసరే కడియం తీస్తారూ?'

'నీబుద్ధి అంగరికీరమ్మంటే వస్తుందా?'

'వెటకారానికేమిటిలెండి. మాఅమ్మకికూడా వొకసారి టిలాగే కాలిమీద కురుపేసింది. ఏవైద్యుడొచ్చిచెప్పినా-అదేమిటో వీళ్లమ్మకడుపుకాలిపోనూ-కడియంతీసెస్తేగాని కురుపు తగ్గదనేవాడు. అలాగనేటప్పటికిమాఅమ్మమండిపడిపోయినానాతిట్లుతిట్టేసేదివాళ్లని. ఆఖరికి పెద్దాసుపత్రికి వెళ్లేటప్పటికి అక్కడిదొరసాని నలుగురిని మాఅమ్మనుగట్టిగాపట్టుకొమ్మనిచెప్పిఆనుట్టుగ కడియం తీయించేసింది దానిల్లు మాసిపోను. మా అమ్మ యెంతేనా గుంజులాడింది, తిట్టింది, కేకలేసింది, యేడ్చింది, వొకంతట తియ్యనిచ్చిందనుకున్నారేమిటి. తెలివితేటా లేని మొద్దుకాబట్టి ఆదొరసాని కడియం తీసేసింది.

'నీతెలివితేటలు యింతవరకూ భూమిమీద పుట్టినవాళ్లలో లేవు. అది నిశ్చయం.'

'సరేలెండి. ఇంకా యీసంగతి వినండి అంతకంటే తమాషాగా వుంటుంది. ముక్కుమీద వేలువేసుకుని అలాగే వుండిపోతారు.'

'అబ్బా! ఏదీ చెప్పు చూదాం.'

'జానికమ్మగారికి కళ్లగపడవు.'

'ఊఁ.'

'పోనీ కళ్లగపడనిమనిషి యింట్లో కూచోవాలా. అలాగ కూచోకుండా కళ్లజోడెట్టుకుని వూరల్లా తిరుగుతూంది! ఎంతఆశ్రియమో.'

'అదీ తప్పే?'

'మీదంతా అవోతంతు. నాకు తెలియనే తెలుసులెండి. బోడివాళ్లని పెళ్లిచేసుకోమనేసజ్జు మీదంతా. మాఅన్నయ్యకీ యిలాంటిదే పుట్టింది.'

'నోరుమూసుకో.'

'నాకెందుకుగాని, అన్నపూర్ణ కాళ్లకు జోడు తొడుక్కుని, గొడుగువేసుకుని స్కూలుకెళుతూంది. విన్నారా యీసంగతి.'

'అయితే, యెండలో నెళ్లేటప్పు డేంచేస్తుంది?'

'పరువుమర్యాదున్నవాళ్లు జోడుతొడుక్కుంటారా, గొడుగు వేసుకుంటారా? ఎండ మండిపోతూన్నా సరే, జోరున వానకురిసేస్తూన్నా సరే యెండుతూ తడుస్తూ వెళతారుగాని గొడుగు వేసుకుంటారా?'

'నీతెలివితేటలకి నే సెప్పుకూ సంతోషిస్తూనే వున్నాను.........ఔనుగాని నేను నిన్ను మనదేశపు గుడ్డ కట్టుకొమ్మని చెప్పలే?'

'ఆగోనెగుడ్డలు నేమొయ్యలేను బాబూ. అవి బరువు.'

'నీకు బరువా, మొయ్యలేవూ? ఉఁఉఁ.'

'ఉరికే వేళాకోళా లాడుకుంటూను.'

'ఇంకముం దవేకట్టుకోవాలి, తెలిసిందా. నేను వూరుకునేవాణ్ణికాను.'

'అలాగేలెండి. ఔనుగాని దేశనాయకులంతా చచ్చిపోయేరు టేమిటి!'

'నీయిల్లు వల్లకాడుగాను, అలాంటిదెకూడా తెచ్చిపెట్టకు. తెలియనిదానివి తెలియనట్టుగానేనా పడివుండవు. నీకదో పెద్దరోగం.'

'నేనన్నమా టనుకున్నా రేమి టది. ఆడవాళ్లంతా కూచుని చెప్పుకున్నారమ్మా. అందరు దేశనాయకులు, పదిపన్నెండుమందిట, ఒకయెద్దుబండీలో వెళుతూ వుంటే ఆబండీ తిరగబడి సముద్రంలో పడిపోయిందిట. అందరూ చచ్చి.'

'ఇంక నోరుముయ్యి, పాడుతెలివితేటలు కనపరచక. చదువురానిపుల్లమ్మ, యెల్లమ్మ కబుర్లకి కూచుంటే యిలాంటివి కాకపోతే మరేలాంటివి పుడతాయి. కాలక్షేప మవడ మెలాగ పశువులికి.'

'ఆగొడవలు నాకెందుకుగాని........ సరే లెండి. చంద్రహారా లెప్పుడు చేయిస్తారూ? ఈ మాటొచ్చినజీతంలో వొక్కదమ్మిడీ ఖర్చుపెట్ట వల్లకాదు.'

'ఉఁ. భోజనం మానేశెయ్యి.'

'ఎంతసేపూ నేను తినేస్తున్నననేకదా మీ—'

'నేను మానెయ్యలేను.'

'భోజనం మానేసుకోవాలేమిటి వస్తువు చేయించుకోడానికి.'

'అయితే యీనెలజీతంలో భీమాకు పోతుంది కొంత.'

'భీమాగీమా అవతలపెట్టండి. ఈపాటికి భీమాలు చాలించండి. భీమాలకి కడితే ఆయుక్షీణంట! మా నాన్న చెప్పేవాడు. ఎందుకొచ్చినభీమా లివి.'

'నీకు తెలియనిసంగతులు అడిగి తెలుసుకోరాదూ. ఆపాగ రెందుకు?'

'మీ రెన్నన్నా సరే యీనెలజీతం ఖర్చుపెట్టవాటంకాదు.'

'చూద్దాంలే.'

'అలాగేలెండి.'

'మనింట్లోకూడా యెలక్ట్రీ పెట్టించుకుంటే బాగుంటుంది.'

'ఏమిటదీ! మళ్లా చెప్పూ!'

'ఏమిటో.'

'ఎలట్రీఅంటే యేమిటో!'

'నాకు తెలియదుపొండి.'

'నువ్వుచెప్పేది కొత్తపేరు. ఇంతవరకూ విన లేదు. అందరినీ యికముందు యీ పేరే వాడమని చెప్తా.'

'అయితే దాని నేమంటారు?'

'ఇంతవరకూ ఎలక్ట్రిక్ అంటున్నారుమరి.'

'ఎలక్ట్రిక్-అదేనా మీరనేది. ఈమాత్రానికేనా యేదో పెద్దమహాభాగ్యంగా చెప్పొచ్చేరు. ఎలట్రిక్, ఎలట్రిక్, ఎలట్రిక్.'

'తొందరపడకూ. ఎలక్ట్రిక్, ఎలట్రిక్ కాదు.'

'అయితే అదేఅనుకోండి. ఇంగ్లీషుముక్కలంతా యింతే. పాడుముక్కలు.'

'నీకు రానివన్నీ పాడువే.'

'అయితే యింతకీ యెలట్రిక్ అంటే వొక నూనెయేమిటి? ఆతీగలో గొట్టంలోంచి అది వెళుతూ వుంటుంది. అంతేనా?'

'నీకు తెలిసింది అంతే.'

'మరయితే అదేమిటి?'

'అదొకశక్తి. అది ప్రవహిస్తుం దాతీగలోంచి.'

'శక్తి! అమ్మవారున్నూ! నిజం చెప్పండివింటా!'

'దానినే శక్తి అంటారు. అది తీగలోంచి వెళుతుంది.'

'తీగలో గొట్టం లేందే యెలావెళుతుంది?'

'గరిటె వొకచివర నిప్పుల్లో పెడితే రెండో చివరికి యెలాగ వేడివెళుతుందో అలాగే యిదీ వెళుతుంది.'

'అదా, అయితే తెలిసింది. అదేఅన్న మాట అలా వెలుగుతుంది. అది మనయింట్లో కూడా పెట్టించుకుంటే బాగావుంటుంది.'

'అది యింట్లో పెట్టించుగోడం అట్టే మంచిది కాదు. దృష్టి చెడిపోతుంది, కళ్లు పోతాయి. వీధుల్లో అయితే ఫర్వాలేదు. దానివల్ల చెడులేదు.'

'ఏమీ. చూడడానికి బాగుంటుంది........ సరేగాని మీరు ఆంధ్రపత్రిక చదువుతున్నారు. నేను కూడా నిన్న చదివేను. దాంట్లో శాసనసభల్ని గురించి యేదో రాసివుంది. శాసనసభలంటే యేమిటి?'

'శాసనసభలంటే అందులో అనేకమంది వుంటారు. వాళ్లంతా దేశంలో అవసరమైన ఒక్కొక్క విషయాన్ని గురించి ఆలోచిస్తారు.'

'అంటే అక్కడ యెవరెవరుంటారు?'

'అంతా సభ్యులుంటారు.'

'అంటే?'

'పోనీ దాన్ని గురించి నీ కెంతమట్టుకు తెలుసో చెప్పు. మిగిలిందంతా చెప్తా.'

'నాకస లదేమిటో తెలీదు.'

'అదంతా నీ కిప్పుడు నేను చెప్పలేను.'

'పోనీండికాని వీరేశలింగం, వీరేశలింగం అంటారుకదా. ఆయన యెవరు, కంసాలా, కాపా?'

'నీకు తెలివి యెంతమట్టుకుందో నాకు స్పష్టంగా తెలుస్తూంది. వీరేశలింగం కంసాలి!'

'ఆక్షేపించకపోతే చెప్పరాదూ?'

'నువ్వే చెప్పేసేవుగా.'

'పోనీ చెప్పండిమరి.'

'ఆయన మొదట బ్రాహ్మడు, తర్వాత బ్రహ్మ అయేడు.'

'బాగా చెప్పండి.'

'బ్రహ్మఅంటే నీ కెంతమట్టుకు తెలుసో చెప్పు. తక్కిందంతా చెప్తాను.'

'నా కసలు తెలియందే.'

'నే నిప్పుడు చెప్పలేను. నీకు అన్నిటినిగురించి 'ఓనమః' లదగ్గరనుంచి చెప్పుకురావాలి. నీ కేమే నా అక్షరాలొస్తే పుస్తకాలిస్తాను చదువుకో. నాకు వోపికా లేదు, తీరికా లేదు.'

(తనలో) 'నయమే! మళ్లా చదువులోకి దిగేరు. ఇంక నోరుమూసుగుంటే మంచిది.'

౬

'ఏమండోయి.'

'ఊఁ.'

'మళ్లీ సోమవారం చంద్రగ్రహణంట. మా అమ్మ రాసింది. నానక్షత్రాన్ని చంద్రగ్రహణం పడుతూందనీ, అంచేత నేను చంద్రగ్రహణం చూడకూడదనీ, బ్రాహ్మడి కొకమానెడు సోలెడు బియ్యం ఏదేనా కూరా యిచ్చుగోవాలనీ రాసింది. ఆరాత్రి మడిపూరగాయలమీద దర్భకర్ర పడేసుకోవాలి. ఓరాత్రివేళ మీ రెలా స్నానంచేస్తారో!'

'నేను స్నానంచెయ్యకపోడం సరేకదా నిన్నుకూడా స్నానంచెయ్యనియ్యను. తెలిసిందా. నీ కన్నిమార్లు చెప్పినా బుద్ధి లేకుండావుంది. గ్రహణమంటే యేమిటో డెబ్భైయెదుసార్లు చెప్పేను.'

'అయితే ముసిలాళ్లకంటే మీ కెక్కువ తెలుసాయేమిటి?'

'ముసిలాళ్లకు తెలివితేట లేడవలేదని చెప్పలేమా?'

'ఎప్పటిసంగతికో యిప్పుడు దెబ్బలాడుకోడమెందుకులెండి...ఇదేమిటే! సోమవారంపూటా కొత్త బట్ట కట్టుకున్నారేమిటి. అయ్యో! అయ్యో! నే నేం చేతునమ్మా!'

'కొత్తబట్టలు కట్టుకోకూడదూ?'

'వారం వర్జ్యం లేదూ?'

'నీతెలివితేటలు తగ్గించుకో, మరేంతప్పిదం లేదు.'

'మీఖర్మం. నేను చెప్పనేచెప్పేనుగా వెనక మండలకి పె—.'

'నోరుముయ్.'

'...................'

'...............'

'ఇ దేమిటిది?'

'మీ కెందుకులెండి.'

'అలాగుకాదు.'

'విడవను.'

'చిరిగిపోతుంది.'

'దాంట్లో మరేంరహస్యాలు లేవు. చదువుకోండి.'

'ఎవరికి రాసేవు?'

'మాఅమ్మకి.'

'పైవిలాసమా యిది!'

'ఊఁ.'

'నీకు బుద్ధి జ్ఞాన ముందా. ఈవుత్తరం యే జన్మానికైనా మీనాన్నకి చేరుకుందా. నరెడ్ల అనడానికి నరెళ్ల అనిరాసేవు, పైగా విశ్వనాథ శాస్త్రికి అనడానికి పిసినాథశాస్రి అన్నావు.'

'మాఅమ్మదగ్గిరనుంచి తెచ్చుకున్న కార్డ్లు అయిపోయేయి. మిమ్మల్ని యెడ్రసురాసిపెట్టండంటే వుత్తరమంతా దిద్దుబాళ్లే, అసహ్యమేస్తూ. అంచేత నేనే రాసుకున్నా.'

'చిరునామా యేమిటి రాసేవు............ బమ్రసీ నరెళ్ల పిసినాథశాస్త్రిగారికి అనేకనమస్కారములు, కాకినాడ రవానా గుడివీధి కాకినాడ కాకినాడ కాకినాడ గుడివీధి నరెళ్ల పిసినాథశాస్త్రిగారి కిచ్చేయవలెను కాకినాడ—యింక స్థలం లేదూ రాయడానికి?'

'ఆక్షేపణలకి మొదలు.'

'తప్పులు చెప్పితే ఆక్షేపణలు, వూరుకుంటే వుత్తమమునా. చిరునామా రాసేమోస్తరిదేనా! ఉత్తరంలో యింకా యెన్నితప్పు లున్నాయో. (ఉత్తరం లాక్కుంటుంది) నీఖర్మం నేనేంచెయ్యనూ.'

'ఈ మొగాళ్లకి చదువు రావడం చాలాకష్టంగావుదమ్మా.'

'అంతేకాని నువ్వుకూడా చదువుకుందామని నీమట్టుకు తోచదు.'

౭

'ఇదిగో!'

'ఊఁ.'

'తమలపాకులు మహాపసందుగా రాసేవు కాని యేదీ మూలపడివున్న హార్మోనియం ముందుకులాగి- నువ్వేదో మూడునాళ్లు సంగిరిగీతం నెలిగించేవుట, యెలాగుంటుందో యెప్పుడూ వినలేదు, మామామగారు నీపాటను మహామెచ్చుకుంటూవుంటాడు, నువ్వు పాడుతూవుంటే కిన్నెరలు మోగిపోతూవుంటాయం టాడు. యేదీ వొక్కమాటు వొక్కకృతి.'

'నాకు రాదు.'

'జాను! నాకు తెలుసు. నీబెట్టుసరి. ఎంతబతి మాలించుకుంటే అంతసరదా నీకు!'

'మీ రేమనుకున్నా సరే.'

'ఒక్కమారు పాడుదూ.'

'నాకు రాదంటేనే.'

'మంచిదానివిగా పాడూ.'

'.................'

'పాడు మరి.'

'.................'

'పాడమంటూవుంటే.'

'మీకు సిగ్గలేదూ.'

'ఎందుకూ సిగ్గు. అయితే యెందుకు సంగీతం నేర్చుకోడం.'

'.................'

'పాడమంటే.'

'..... ...........'

'నాకు కోపం తెప్పించకుమరి.'

'..... ...........'

'ఊరుకున్నంతసేపే నేను మంచివాణ్ణి.'

'.................'

'నామంచితనం చూడడం లేగు నువ్వు.'

'.................'

'పాడవూ అయితే.'

'.................'

'పాడవూ.'

'..............'

'ఇదిగో! నేను నాస్నేహితుడు వెంకట్రా వింటికి వెళ్లిపోతూన్నా. ఇవాళరా త్రక్కడే పడక. నీయేడుపు నువ్వేడవాలి.'

'నే నొక్కర్తైనూ వుండలేను. నాకు భయం.'

'ఏడిసేవు.'

'పాడతానండీ.'

'నోరుముయ్!'